బషీరాబాద్ ఎస్ఐని సస్పెండ్ చేయాలి

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య

పరిగి, ఆగస్టు 16 : దళిత మహిళను చిత్రహింసలకు గురి చేసిన బషీరాబాద్ ఎస్ఐని వెంటనే సస్పెండ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య డిమాండ్ చేశారు. బషీరాబాద్ మండలంలోని నవల్గ గ్రామానికి చెందిన దళిత మహిళను తన కుమారుడి విషయంలో ఎస్ఐ ఠాణాకు పిలిపించి కొట్టడంతోపాటు చిత్రహింసలకు గురి చేయడం, తుపాకీతో కాల్చి చంపుతానని బెదిరించిన ఎస్ఐపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. ఆమె కుమారుడు తప్పు చేస్తే చట్టప్రకారం అతడిని శిక్షించాలి కానీ.. తల్లిని హింసించడం ఎంతవరకు సమంజసమన్నారు. సీఎం సొంత జిల్లాలో గత నాలుగు నెలలుగా దళితులు, గిరిజనులపై పోలీసుల దౌర్జన్యం పెరిగిపోతున్నదని.. ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిరుద్యోగులకు వివిధ కోర్సుల్లో శిక్షణ

వికారాబాద్, ఆగస్టు 16 : నిరుద్యోగులకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు వికారాబాద్ జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి ఉపేందర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టీజీ బీసీఈఎస్‌డీటీసీ (టీజీబీసీ స్టడీ సర్కిల్) ఫ్రిజ్‌లు, వాషింగ్‌మెషిన్లు, ఎయిర్ కండిషనర్ల రిపేర్, ఇన్‌స్టలేషన్ అండ్ గ్యాస్ చార్జింగ్, మెక్రోవేవ్ ఒవేన్, వాటర్ ప్యూరిఫైర్ తదితర కోర్సుల్లో బీసీ కులస్తులకు కుషాయిగూడలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఫ్రిజ్, వాషింగ్ మిషన్ , ఎయిర్ కండిషనర్ రిపేర్, గ్యాస్ చార్జింగ్‌కు టెన్త్/ ఐటీఐ/ డిప్లొమా/ఇంటర్/ఒకేషనల్ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. అదేవిధంగా ఎల్ఈడీ, ఓఎల్ఈడీ మానిటర్, మైక్రోవేవ్ ఒవెన్, వాటర్ ప్యూరిఫైర్ తదితర వాటికి టెన్త్/ ఇంటర్/ఒకేషనల్ అర్హత ఉండాలని.. వీరికి 90 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ కాలంలో నెలకు రూ.4000 చొప్పున మూడు నెలలపాటు స్టైఫండ్ ఇస్తారన్నారు. శిక్షణ సమయంలో స్టడీ మెటీరియల్, లంచ్, టీషర్ట్, బ్యాగ్, సర్టిఫికేషన్ (L4 లెవల్), జాబ్ ప్లేస్‌మెంట్ (ఇండియా /అబ్రోడ్) ఇవ్వబడుతుందన్నారు. అభ్యర్థుల ఎంపిక టెన్త్ మార్కుల ఆధారంగా ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు www. tgbcstudycircle. cgg. gov. in ద్వారా ఆగస్టు 24 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మెడికల్ కళాశాల విద్యార్థుల ర్యాలీ

పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటనను నిరసిస్తూ.. శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలోని పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాల వైద్య విద్యార్థులు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఇది మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాల నుంచి ప్రారంభమై శంకర్‌పల్లి చౌరస్తా వరకు కొనసాగింది. జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని.. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో మెడికల్ కళాశాల డీన్ డాక్టర్ సత్యనారాయణ, ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ జోయారాణి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు. -చేవెళ్ల టౌన్, ఆగస్టు 16

ఆధునీకరణ పనులను వేగవంతం చేయాలి

కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ కింద ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రైల్వేస్టేషన్ల ఆధునీకరణ పనులను వేగవంతం చేయాలని దక్షిణ మధ్య రైల్వే డీఆర్ఎం భరతేశ్‌కుమార్ జైన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని సేడం, తాండూరు రైల్వేస్టేషన్లను సందర్శించారు. స్టేషన్లలో జరుగుతున్న పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. రూ. 27 కోట్లతో రైల్వేస్టేషన్లలో నవీకరణ పనులు జరుగుతున్నా యని..వాటిని త్వరగా పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా ప్రయాణికులు అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. -తాండూరు, ఆగస్టు 16

వైద్య సిబ్బందిపై దాడులు తగవు

- షాద్‌నగర్ సర్కారు కమ్యూనిటీ దవాఖాన ఎదుట వైద్య సిబ్బంది నిరసన
- స్టాఫ్ నర్సుపై దాడి చేసిన మహిళపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

సర్కారు దవాఖాన ఎదుట నిరసన తెలుపుతున్న సిబ్బంది

షాద్‌నగర్, ఆగస్టు 16 : సర్కారు దవాఖాన స్టాఫ్ నర్సుపై దాడి చేసిన మహిళపై చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బంది శుక్రవారం ఆస్పత్రి ఎదుట నిరసన తెలిపారు. షాద్‌నగర్ పట్టణానికి చెందిన నీలం భార్గవి అనే మహిళ కుక్క కాటు టీకా కోసం గురువారం రాత్రి షాద్‌నగర్ సర్కారు కమ్యూనిటీ దవాఖానకు వచ్చింది. వైద్యులు సూచించిన విధంగా టీకాలు వేయించుకోవాలని.. వైద్యులు రాసిచ్చిన చీటిని చూపాలని విధుల్లో ఉన్న స్టాఫ్ నర్సు ఆశ భార్గవికి సూచించింది. ఈ విషయమై ఇరువురి మధ్య వాగ్వాదం జరిగి.. ఆ క్రమంలోనే నర్సుపై ఆమె దాడి చేసింది. ఈ ఘటన మొత్తం దవాఖానలో ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డుఅయింది. ఈ విషయమై శుక్రవారం ఉదయం వైద్య సిబ్బందిపై దాడులు ఆపాలని.. దాడికి పాల్పడిన మహిళపై కఠిన చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బంది దవాఖాన ఎదుట నిరసన తెలిపారు. బాధిత నర్సు షాద్‌నగర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

కొత్తూరులో శ్రీనివాస క్లినిక్ సీజ్

శ్రీనివాస ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌ను సీజ్ చేస్తున్న జిల్లా వైద్యాధికారులు

కొత్తూరు, ఆగస్టు 16 : మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ శ్రీనివాస క్లినిక్‌ను జిల్లా వైద్యాధికారులు శుక్రవారం సీజ్ చేశారు. ఆయుర్వేదిక్ డాక్టర్ రంజిత్ రెండు రోజుల కిందట గిరిజన మైనర్ బాలికకు అబార్షన్ చేసిన కేసు విషయంలో రంగారెడ్డి డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు, షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, జిల్లా టీమ్ సభ్యులు ఆ క్లినిక్‌ను సీజ్ చేశారు. అతడి పరిధిని దాటి గిరిజన మైనర్ బాలికకు అబార్షన్ చేయడంతోనే సీజ్ చేసినట్లు రంగారెడ్డి డీఎంహెచ్‌వో తెలిపారు. అంతకు ముందే పోలీసులు రంజిత్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసి అతడిని అరెస్టు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా ఆఫీసర్ తిరుపతిరావు , శ్రీనివాసులు, కొత్తూరు పీహెచ్‌సీ డాక్టర్ హరికిషన్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, సీహెచ్‌వో నాగేశ్, శ్రీకాంత్, నవాజ్, ఆశలు పాల్గొన్నారు.

అధికారుల అనుమతి లేకుండానే

అంగన్‌వాడీ భవనం కూల్చివేత

- శిథిలావస్థకు చేరిందనే సాకుతో..
- ఆ స్థలంలో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి కొందరి యత్నం
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న స్థానికులు

అనుమతుల్లేకుండానే జేసీబీతో కూల్చివేస్తున్న అంగన్‌వాడీ భవనం

షాద్‌నగర్ రూరల్, ఆగస్టు 16 : ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులేకుండానే ఫరూక్‌నగర్ మండలంలోని అన్నారం గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ భవనాన్ని కొందరు స్థానికులు జేసీబీతో కూల్చివేశారు. 240 చదరపు గజాల ప్రభుత్వ స్థలంలో ఆ భవనం ఉండగా శిథిలావస్థకు చేరిందనే సాకుతో కూల్చివేయడంపై అన్నారంవాసులు మండిపడుతున్నారు. అధికారుల అనుమతి లేకుండా ఎలా కూల్చివేస్తారని..కూల్చివేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొంటున్నారు. అంగన్‌వాడీ భవనాన్ని కూల్చివేసిన స్థలంలో మహిళా సమాఖ్య భవనాన్ని ఎలా నిర్మిస్తారని.. ఆ స్థలంలో అంగన్‌వాడీ బిల్డింగ్‌నే నిర్మించాలని స్పష్టం చేస్తున్నారు. మహిళా సమాఖ్య భవనాన్ని గ్రామంలో ఖాళీగా ఉన్న స్థలంలో ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కూల్చేందుకు అనుమతి ఇవ్వలేదు

అన్నారంలోని అంగన్‌వాడీ భవన కూల్చివేతకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. శిథిలావస్థకు చేరిన ఆ భవనాన్ని కూల్చివేయాలని గతంలో దరఖాస్తు చేసినట్లు తెలిసింది.

- గోపాల్, పంచాయతీరాజ్ ఏఈ

కొందరు కూల్చివేశారు..

గ్రామంలోని అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గతంలోనే ఆ కేంద్రంలో చదువుతున్న చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాం. కానీ, గ్రామానికి చెందిన కొందరు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే తొందరపడి ఈ కేంద్రాన్ని కూల్చివేశారు.

- రాములుగౌడ్, మాజీ సర్పంచ్

ప్రొఫెసర్ పండరి పాండేకు ప్రతిష్టాత్మక అవార్డు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 16: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఐఈటీఈ) అందించే ప్రతిష్టాత్మక లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు 2024 సంవత్సరానికి గాను ఓయూ ఈసీఈ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ వీఎం పండరి పాండేకు దక్కింది. ఆయన ఖరగ్‌పూర్ ఐఐటీతో పాటు ఓయూలో నాలుగు దశాబ్దాల పాటు పరిశోధకుడిగా, అధ్యాపకుడిగా సేవలందించారు. ఆయన తన పరిశోధన క్రమంలో 170కి పైగా పరిశోధన పత్రాలు వివిధ జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. అలాగే ఐఈటీఈ అందించే ప్రొఫెసర్ శ్రీనివాసన్ మెమోరియల్ అవార్డు ఈ ఏడాదికిగానూ ఓయూ ఈసీఈ విభాగానికే చెందిన ప్రొఫెసర్ నవీన్‌కుమార్‌ను వరించింది.

హైకోర్టు అక్షింతలు వేసినా..

చెరువుల బఫర్ జోన్లపై దృష్టిపెట్టని హెచ్ఎండీఏ

సిటీబ్యూరో, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): లేక్ సిటీగా గుర్తింపు పొందిన హైదరాబాద్ నగరం.. మానవ తప్పిదాలు, అధికారుల నిర్లక్ష్యం, కబ్జాకోరుల చర్యలతో తన ఖ్యాతిని కోల్పోతున్నది. బఫర్ జోన్ హద్దులను చేరిపేసి ఆక్రమణలు జరుగుతుండటంతో చెరువులు తమ స్వరూపాన్ని కోల్పోతున్నాయి. కనీసం బఫర్, ఎఫ్‌టీఎల్ జోన్లను అయిన నిర్ధారించకుండా అధికారులు నిర్లక్ష్యం చేయడంతో తటాకాలు భూమిలో కలిసిపోతున్నాయి. ఈ క్రమంలో పలువురు పర్యావరణవేత్తలు, సామాజిక కార్యకర్తలు చెరువులను రక్షించండి మహాప్రభో.. అంటూ హైకోర్టును ఆశ్రయించారు. స్పందించిన న్యాయస్థానం హెచ్ఎండీఏ పరిధిలోని చెరువుల స్థితిగతులపై అధికారులను ప్రశ్నించింది. మొత్తం చెరువులెన్నీ, ఎన్ని చెరువులకు సరైన హద్దులు, వాస్తవ ఫుల్ ట్యాంక్ లెవల్ ఎంత.? ఇప్పుడు ఎంత మేర చెరువు పరిసరాల్లో నిర్మాణాలు ఉన్నాయంటూ.. ప్రశ్నిస్తూ మూడు నెలల్లో బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ హద్దులను సరి చేయాలంటూ హెచ్ఎండీఏను ఆదేశించింది.

మూడు నెలల్లో ఈ ప్రక్రియ పూర్తి కావాలని, సమగ్రమైన నివేదికతో నవంబర్‌లో జరిగే విచారణ రోజున సమాచారం అందించాలంటూ అక్షింతలు వేసింది. కానీ, ఇప్పటి వరకు హెచ్ఎండీఏ లేక్ విభాగం ఆ దిశగా కార్యాచరణ రూపొందించలేదు. ఏడు జిల్లాల పరిధిలో విస్తరించిన హెచ్ఎండీఏ 3,532లకు పైగా చెరువులు, కుంటలతో వాటర్ బాడీస్ కలిగి ఉంది. వీటి పర్యవేక్షణ, నిర్వహణ, పరిరక్షణ, ఆధునీకరణ కార్యకలాపాలను ఆ సంస్థనే చేపడుతుండగా.. చెరువు హద్దులను కాపాడటం కూడా హెచ్ఎండీఏదే బాధ్యత. అయితే, ఇప్పటి వరకు 2,525 చెరువులకు మాత్రమే ప్రాథమికంగా హద్దులను ఖరారు చేసింది. 230 చెరువులకే మాత్రమే బఫర్ జోన్ ఎఫ్టీఎల్ నిర్ధారణ జరిగినట్లు తేలింది. ఈ క్రమంలో చెరువులను పరిరక్షించడంలో కీలకమైన బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ ఎందుకు ఖరారు చేయాలేదని హెచ్ఎండీఏను ప్రశ్నించి, 3 మూడు నెలల్లో మిగిలిన 1000 చెరువులకు హద్దులను నిర్ధారించాలని హైకోర్టు స్పష్టం చేసింది. కానీ, హెచ్ఎండీఏ అధికారులు ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. కనీసం చెరువులు, ఎఫ్‌టీఎల్‌లో, బఫర్ జోన్‌లో ఉన్న ఆక్రమణల లెక్కలను వెలికి తీయలేదని తెలుస్తోంది.

మాట్లాడుతున్న టీఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్

రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలి

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 16: సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ (టీఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఉద్యోగవిరమణ చేసి ఉద్యోగాల్లో కొనసాగుతున్న వారిని తక్షణమే తొలగించాలని కోరారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీకాంత్‌యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో డిపార్ట్‌మెంట్ హెడ్‌లు, ఇతర ఉన్నత స్థానాల్లో దాదాపు 1050 మంది ఉద్యోగవిరమణ చేసిన అనంతరం కూడా కొనసాగుతున్నారని ఆరోపించారు. వారికి వేతనాలు, ఇతర భత్యాల కింద నెలకు రూ.150 కోట్ల ప్రజా ధనం కేటాయించాల్సి వస్తున్నదన్నారు. దాంతోపాటు అర్హులైన సీనియర్ ఉద్యోగులకు పదోన్నతులు దక్కకుండానే రిటైర్డ్ అవ్వాల్సిన దుస్థితి నెలకొన్నదన్నారు. ఒకవైపు నిరుద్యోగ సమస్య రోజురోజుకూ పెరిగిపోతుందన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే సెక్రటేరియట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. టీఎస్ఏ నాయకులు రామ్‌కిషన్, మురళీకృష్ణ, రంజిత్‌వర్మ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు

వర్సిటీల్లో 60 ఏండ్లు దాటినా

కాంట్రాక్ట్ ప్రొఫెసర్లు కొనసాగొచ్చు

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 16: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ యూనివర్సిటీల్లో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు సంబంధిత విభాగాల్లో అవసరమైతే ఆరవై ఏళ్ల వయసు దాటినా కొనసాగొచ్చని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ విద్యాశాఖ ఆదేశాల మేరకు జారీ చేస్తున్న ఉత్తర్వులను మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ అన్ని యూనివర్సిటీల రిజిస్ట్రార్‌లకు పంపించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వర్సిటీల్లో నాణ్యమైన బోధన అందించడంలో వెనక్కి తగ్గది లేదన్నారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా విద్యార్థులకు అత్యున్నతమైన విద్యను అందించేందుకు కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు. ఆయా యూనివర్సిటీల్లోని విభాగాల్లో ఉన్న అవసరాన్ని బట్టి కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సేవలను కొనసాగించుకోవచ్చని సూచించారు.

దూర విద్య ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 16: ఉస్మానియా యూనివర్సిటీ దూర విద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సీడీఈ)లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పీజీఆర్ఆర్‌సీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ జీబీ రెడ్డి తెలిపారు. యూజీసీ నిబంధనల మేరకు వివిధ కోర్సులకు ప్రతి ఏటా రెండు దఫాలుగా ప్రవేశాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా మొదటి దఫా శుక్రవారం నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు ప్రవేశాలు నిర్వహిస్తామని ప్రకటించారు. వివిధ పీజీ, యూజీ, డిప్లమా, సర్టిఫికెట్ కోర్సులతో కలిపి మొత్తం 72 ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్ కోర్సులను అందిస్తున్నట్లు వివరించారు. కోర్సుల వివరాలు, నిబంధనలు, ఫీజు వివరాలు తమ వెబ్‌సైట్ www.oucde.netలో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. అందులో లాగిన్ అయి దరఖాస్తు ఫారం నింపాలని సూచించారు. రిజిస్ట్రేషన్ ఫీజు, కోర్సు ఫీజు, పరీక్షా ఫీజులను ఆన్‌లైన్ విధానంలోనే చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

స్పేస్ టెక్నాలజీలో

ఆవిష్కరణలకు ప్రోత్సాహం

టీహబ్ నిపుణులతో 20న సమావేశం

సిటీబ్యూరో, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): స్పేస్ టెక్నాలజీలో ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు టీహబ్ ఆధ్వర్యంలో ఇండస్ట్రీ నిపుణులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నామని టీహబ్ ప్రతినిధి తెలిపారు. ఉజ్వల భవిష్యత్తు ఉన్న స్పేస్ టెక్నాలజీతో ఇప్పటికే హైదరాబాద్ కేంద్రంగా పలు స్టార్టప్‌లు తమ కార్యకలాపాలను ప్రారంభించి, మంచి ఫలితాలను సాధించాయి. ఈ రంగంలో మరిన్ని ఆవిష్కరణలు చేసేందుకు అవకాశం ఉందని స్పేస్ టెక్నాలజీ నిపుణులు చెబుతుండటంతో ఔత్సాహికులైన స్టార్టప్ వ్యవస్థాపకులకు అవకాశాలపై అవగాహన కల్పించేందుకు ఈనెల 20న టీ హబ్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు.‘ సస్టెయినబిలిటీ ఇన్ స్పేస్’ అనే అంశంపై వయశాట్ కంపెనీ అధ్యక్షుడు గురు గౌరప్పన్, సీఈఓ మార్క్ డాంక్‌బర్గ్, సీడీఓ రవి వర్మ నంబూరి ప్రసంగిస్తారని తెలిపారు. వివరాలకు, పేర్లు నమోదు చేసుకునేందుకు లింకు (https://tevents.t-hub.co/SustainabilityinSpace)లో సంప్రదించాలని తెలిపారు.

‘సర్దార్’ స్ఫూర్తిగా బహుజనులంతా ఏకం కావాలి

సర్వాయి పాపన్న గౌడ్ జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయం : మంత్రి పొన్నం

గొప్ప పాలనకు మారు పేరు సర్దార్ పాపన్న సాహసం : ఎంపీ ఈటల

చిక్కడపల్లి, ఆగస్టు16: సర్దార్ సర్వాయి పాపన్నను స్ఫూర్తిగా తీసుకుని రాజ్యాధికారం కోసం బహుజనులంతా ఏకమై ముందుకు సాగాలని పలువురు ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. తెలంగాణ గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో దళిత బహుజన విప్లవ వీరుడు, స్వయం పరిపాలకుడు సర్దార్ సర్వాయి పాపన్న 374 జయంతి ఉత్సవ సభను శుక్రవారం చిక్కడపల్లిలో ఘనంగా నిర్వహించారు. కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజు గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, శాసన మండలి మాజీ చైర్మన్ కె.స్వామిగౌడ్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, మాజీ ఎంపీ హన్మంతరావు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, మాజీ ఐఏఎస్ చిరంజీవులు పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సభలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. సర్వాయి పాపన్న గౌడ్ జీవితం నేటి యువతకు ఆదర్శనీయమని, స్ఫూర్తిదాయకమని అన్నారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ మహనీయుల జయంతి, వర్ధంతులను జరుపుకోవడం అంటే వారి ఆశయ సాధనకు కృషి చేయడమేనని అన్నారు. పాపన్న విగ్రహం చూడగానే కర్తవ్యం గుర్తుకు రావాలని, గొప్ప పాలన అందించిన సర్దార్ పాపన్న సాహసానికి మారు పేరు అని కొనియాడారు. సమావేశంలో కమిటీ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలికట్టే విజయ్ కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ గడ్డమీది విజయ్ కుమార్ గౌడ్, వెంకటేశ్ గౌడ్, గణేశాచారి, అంబాల నారాయణ గౌడ్, ఎంవీ రమణ, గాయకులు రామలింగం, ఎపూరు సోమన్న తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, కమిటీ చైర్మన్ బాలరాజు గౌడ్

మెడికల్ కోడింగ్‌లో ఉచిత శిక్షణ

ఉప్పల్, ఆగస్టు 16: అప్స- టెక్ మహీంద్రా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రేటర్ హైదరాబాద్‌లోని నిరుద్యోగ యువతకు మెడికల్ కోడింగ్‌లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు హబ్సిగూడ సెంటర్ సమన్వయకర్త పురుషోత్తం గోపి తెలిపారు. 20-28 ఏండ్ల వయసు కలిగిన బీఎస్సీ, బీకాం, బీ ఫార్మసీ, ఎంఫార్మసీ, ఎమ్మెస్సీ, ఎం కా మ్ తదితర విభాగాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు మెడికల్ కోడింగ్‌లో నాలుగు నెలల పాటు ఉచిత శిక్షణ అందిస్తామన్నారు. మెడికల్ టెర్మనాలజీ, హ్యూమన్ అనాటమీ, పిజియాలజీ, ఐసీడీ-10, సీపీటీ, హెచ్‌సీపీఎస్ అండ్ ఆర్‌సీఎంతో పాటు స్పోకెన్ ఇంగ్లిష్, ఇంటర్నెట్ కాన్సెప్ట్స్, ఇంగ్లిష్ టై పింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్‌లో శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణతోపాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి కలిగిన యువకులు ఫోన్ నం. 91549 90132, 91549 90130 లలో సంప్రదించాలన్నారు.

ట్రేడింగ్ పేరుతో రూ.35 లక్షలు టోకరా

సిటీబ్యూరో, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): వాట్సాప్ గ్రూప్‌తో 69 ఏండ్ల వ్యాపారిని ఆకర్షించిన సైబర్ నేరగాళ్లు.. ట్రేడింగ్ పేరుతో రూ.35.36 లక్షలు కాజేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బాధితుడి వాట్సాప్ నంబర్‌ను ‘బి-9హెచ్ఎఫ్‌సీ సెక్యూరిటీ’ పేరుతో ఉన్న గ్రూప్‌లో యాడ్ చేశారు. అందులో 159 మంది సభ్యులున్నారు. ఆ సభ్యులంతా.. తాము ట్రేడింగ్ చేసిన స్టాక్స్‌లో మంచి లాభాలొచ్చాయంటూ చెప్పుకొంటున్నారు. బాధితుడు వారి మాటలు నిజమని నమ్మాడు. మొదట ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌పై రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటూ ఒక లింక్ పంపించి.. అప్లికేషన్ డౌన్‌లోడ్ చేయించారు. ఆ తరువాత మీకు నమ్మకం వచ్చేంత వరకు చూడండి, నమ్మకం కుదిరితేనే ట్రేడింగ్ చేయడంటూ నేరగాళ్లు సూచించారు. మొదట లాభాలు ఇచ్చిన సైబర్‌నేరగాళ్లు.. ఆ తరువాత ఎక్కువ మొత్తంలో పెట్టుబడులు పెట్టిస్తూ, స్క్రీన్‌పై లాభాలు చూపించారు. స్క్రీన్‌పై కనిపించిన లాభాలను విత్ డ్రా చేసుకునే వీలులేకుండా చేశాడు. 30శాతం కమీషన్ ఇస్తేనే స్క్రీన్‌పై కనిపించే లాభాలు విత్ డ్రా చేసుకునే అవకాశం ఉంటుందని నేరగాళ్లు సూచించారు. కమీషన్ మినహాయించి మిగతా డబ్బులు ఇవ్వాలంటూ బాధితుడు కోరగా.. సైబర్‌నేరగాళ్లు తరస్కరించారు. అప్పటికే రూ. 35,36,526 ట్రేడింగ్‌లో పెట్టిన బాధితుడిని మరింతగా పెట్టుబడి పెట్టాలంటూ నేరగాళ్లు ఒత్తిడి చేశారు. ఇదంతా మోసమని గుర్తించిన బాధితుడు సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.